ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 7 జూన్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.172	242	272
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 23.4

మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యం

- మొదటి ప్రాధాన్యంలో ముందంజ
- ద్వితీయ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి
- మొదటి ప్రాధాన్యంలో ఎవరికీ రాని కోటా ఓటు
- ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రారంభం
- అశోక్‌కుమార్, ప్రేమేందర్‌రెడ్డి ఓట్లే కీలకం
- నేటి రాత్రికి తుదిఫలితం వచ్చే అవకాశం



నల్లగొండలో కొనసాగుతున్న కౌంటింగ్

కౌంటింగ్ వివరాలు వెల్లడిస్తున్న ఆర్వో హరిచందన

నల్లగొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): శాసనమండలి నల్లగొండ-వరంగల్- ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో గురువారం రాత్రికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్‌కుమార్) 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 1,22,813 మొదటి ప్రాధాన్య ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి 1,04,248 ఓట్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. రాకేశ్‌రెడ్డి కంటే మల్లన్నకు 18,565 ఓట్ల ఆధిక్యత లభించింది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి 43,313 మొదటి ప్రాధాన్య ఓట్లతో మూడోస్థానంలో ఉండగా, నల్లగొండకు చెందిన స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ 29,697మొదటి ప్రాధాన్య ఓట్లు సాధించి నాలుగోస్థానంలోకి వచ్చారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో గతానికి భిన్నంగా అత్యధికంగా 25,824 చెల్లనిఓట్లు ఉన్నాయి. మొత్తం చెల్లిన ఓట్ల ఆధారంగా 1,55,095 ఓట్లను కోటా ఓటుగా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. మొదటి ప్రాధాన్య ఓట్లలో ఆధిక్యత సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోటా ఓటు సాధించాలంటే ఆయనకి ద్వితీయ ప్రాధాన్య ఓట్లలో 32,282 ఓట్లు రావాల్సి ఉంది. అదే రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు రావాల్సి ఉంది. ఉప ఎన్నిక కౌంటింగ్ శుక్రవారం సాయంత్రానికి ముగిసే అవకాశం కనిపిస్తోంది.

నేటి రాత్రికి ఫలితం వచ్చే అవకాశం

ఉప ఎన్నికలో మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికలో నలుగురికి మినహా మిగిలిన అభ్యర్థులందరికీ అతి తక్కువ ఓట్లే వచ్చాయి. కొందరికి డబుల్ డిజిట్ ఓట్లే రావడం గమనార్హం. అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ మెదలుపెట్టి వారి ద్వితీయ ప్రాధాన్య ఓట్లను పోటీలో ఉన్న ఇతర అభ్యర్థులకు కలుపుతూ వస్తారు. ఇలా ప్రధాన అభ్యర్థులు మినహా మిగిలిన 48 మంది అభ్యర్థుల ఓట్లు కలిపినా కోటా ఓటు వచ్చే అవకాశం ఉండదు. అయితే ఈ 48 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ శుక్రవారం ఉదయం వరకు కొనసాగే పరిస్థితి ఉంది. ఇదే సమయంలో మూడో రౌండ్ ఓట్ల కౌంటింగ్‌పై తమకు అనుమానాలున్నాయని, మళ్లీ లెక్కించాలని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఎన్నికల సంఘం ఆయన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుంటుందా? లేదా? అనే అంశం తేలాల్సి ఉంది.

విజేతను తేల్చేది ఆ ఇద్దరి ద్వితీయ ప్రాధాన్య ఓట్లే

స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన నల్లగొండకు చెందిన పాలకూరి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయ్యాక, వారి బ్యాలెట్లలోని ద్వితీయ ప్రాధాన్య ఓట్లే విజేతను తేల్చే అవకాశముందని భావిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన అశోక్‌కుమార్, 48 మంది స్వతంత్ర అభ్యర్థుల తర్వాత ఎలిమినేట్ అవుతారు. ఆయన ఓట్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎవరికి ఏ స్థాయిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లు వస్తాయనే అంశం కీలకం కానుంది. అయితే కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న రాజకీయనేతలు, పరిశీలకులు అశోక్‌కుమార్‌కు చెందిన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు ఎవరికీ రాదని, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ తప్పదని భావిస్తున్నారు. ఆయన బ్యాలెట్ల ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక కోటా ఓటు రావచ్చని అంచనా వేస్తున్నారు. అయితే అప్పటికీ కోటా ఓటు రాకపోతే రెండో స్థానంలో ఉండే అభ్యర్థికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లనూ లెక్కిస్తారు. అప్పటికీ కోటా ఓటు రాకపోతే తృతీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో ఫలితం తేలే అవకాశం ఉంది.

అభ్యర్థులను చెమటలు పట్టించిన చెల్లని ఓట్లు

మొదటి ప్రాధాన్య ఓట్లలో చెల్లని ఓట్లు అత్యధికంగా నమోదవడం ప్రధాన పార్టీల అభ్యర్థులను చెమటలు పట్టిస్తున్నాయి. ఎన్నడూలేని రీతిలో పోలైన ఓట్లలో దాదాపు 8.50శాతం ఓట్లు చెల్లకుండా పోయాయి. మూడో రౌండ్ వరకే 23,784 ఓట్లు చెల్లకుండా పోగా, ప్రధాన అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగో రౌండ్ ముగిసే సరికి 25,824ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎంతో అవగాహన ఉన్న గ్రాడ్యుయేట్ల ఓట్లే ఈ స్థాయిలో చెల్లకుండా పోవడమేంటని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లపై అడ్డగోలు రాతలు, నినాదాలు, సంతకాలు, ఫోన్ నెంబర్లు, ప్రాధాన్య ఓటు ఇవ్వడంలో నిర్లక్ష్య వైఖరి తదితర కారణాలతో ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లని ఓట్లు అధికంగా ఉండడం వల్లే మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఎవ్వరికీ రాలేదని, అనివార్యంగా ద్వితీయ ప్రాధాన్యానికి వెళ్లాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అభ్యర్థుల సంఖ్య	52
మొత్తం ఓట్లు	4,63,839
పోలైన ఓట్లు	3,36,013
చెల్లిన ఓట్లు	3,10,189
కోటా ఓట్లు	1,55,095

అభ్యర్థి (పార్టీ)	మొదటి రౌండ్	రెండో రౌండ్	మూడో రౌండ్	నాలుగో రౌండ్	మొత్తం
తీన్మార్ మల్లన్న (కాంగ్రెస్)	36,210	34,574	35450	16,579	1,22,813
ఏనుగు రాకేష్‌రెడ్డి (బీఆర్ఎస్)	28,540	27,574	31242	16,892	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి (బీజేపీ)	11,395	12,843	10278	8,797	43,313
పాలకూరి అశోక్ (స్వతంత్ర)	9,109	11,214	7170	2,204	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	8,658	2,040	25,824



బీబీనగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న ఆసుపత్రి

ఆంధ్రజ్యోతి విజిట్

24 కాదు.. 7 గంటలకే పరిమితం

- ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరితో సేవలు
- స్టాఫ్‌నర్సుల కొరత
- రాత్రి వేళ అందని వైద్యసేవలు
- మౌలిక వసతులు అంతంతే

పేదలకు అన్నిసమయాల్లో వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో 24గంటల ఆసుపత్రులను ప్రభుత్వాలు ఏర్పాటుచేశాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రులు నిర్మించినా సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు అందడంలేదు. వైద్యులు, స్టాఫ్‌నర్సు సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్యుడి సేవలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకే అందుతున్నాయి. స్టాఫ్‌నర్సు లేని సమయంలో ఏఎన్ఎంలతోనే సేవలు కొనసాగిస్తున్నారు. రాత్రి వేళ ఆసుపత్రులను మూసివేస్తున్నారు. దీంతో ఆసుపత్రుల ఏర్పాటు లక్ష్యం నీరుగారుతోంది. అంతేకాకుండా సాధారణ జబ్బుల మందులే తప్ప అత్యవసరమైన మందులు లభించడంలేదు. దీంతో ప్రైవేట్ దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. వైద్యులు లేక, సౌకర్యాలు లేక సరైన సేవలు అందక పోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


వివరాలు 8లో

కాంగ్రెస్ తీన్మార్



8లో..

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నల్లగొండ గద్దర్ పాటకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సందడి చేశారు.



ఓటు బ్యాంక్ తారుమారు

- గణనీయంగా తగ్గిన బీఆర్ఎస్ ఓట్లు
- మెజార్టీలున్నా కాంగ్రెస్‌కూ తగ్గిన ఓట్లు
- బీజేపీనీ వెంటాడిన సమన్వయలోపం
- మూడు పార్టీల్లోనూ భిన్నమైన విశ్లేషణలు

లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల్లో ఆసక్తికర విశ్లేషణలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు ప్రధాన పార్టీల ఓట్లకు గణనీయమైన గండి పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ద్వితీయస్థానంలో కొనసాగిన బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికలకు వచ్చేసరికి సగానికిపైగా ఓటు బ్యాంకును కోల్పోయింది. బీజేపీ ఓటు బ్యాంకు అనూహ్యంగా పెరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు భారీగా మెజార్టీలు నమోదైనా, రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటింగ్ తగ్గింది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంతో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేట నియోజకవర్గంలో మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ ఓటింగ్ తగ్గింది. ఈ తగ్గుదల కోదాడ, నల్లగొండల్లో స్వల్పంగా ఉండగా, మిగిలిన చోట్ల భారీగా ఉంది. నల్లగొండ లోక్‌సభ స్థానంలో అనూహ్యంగా ద్వితీయ స్థానంలోకి వచ్చిన బీజేపీకి ఆ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సొంత నియోజకవర్గం హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ కంటే తక్కువ ఓట్లు రాగా, సూర్యాపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే తక్కువ ఓట్లు ఈ ఎన్నికల్లో నమోదయ్యాయి. ఇలా పలు భిన్నమైన ఫలితాలు ఈ ఎన్నికల్లో వెలువడడంతో భవిష్యత్ రాజకీయం ఎలా ఉండనుందనేది ఆసక్తికరంగా మారింది.

బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ తగ్గింది

ఉమ్మడి జిల్లాలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక అసెంబ్లీ స్థానాన్ని గెలవగా, మిగిలిన అన్ని చోట్లా ద్వితీయ స్థానంలో ఉంది. నల్లగొండ లోక్‌సభ పరిధిలో ఏడింట ఆరుచోట్ల ద్వితీయ స్థానంలో, సూర్యాపేటలో మొదటి స్థానంలో ఉన్న పార్టీ 33.13 శాతం ఓటు బ్యాంక్ సాధించింది. భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఏడు సీట్లలోనూ ఆరింటిలో ద్వితీయ స్థానంలో ఉండి, 4,78,631 ఓట్లతో 36.39శాతం ఓట్ బ్యాంక్‌ను నిలబెట్టుకుంది. అయితే లోక్‌సభకు వచ్చేసరికి ఆ పార్టీ ఓట్ బ్యాంక్ పూర్తిగా పడిపోయింది. 2,18,417 ఓట్లతో 17.10శాతానికే పరిమితమైంది. భువనగిరి లోక్‌సభ స్థానంలో ఏడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో 5,60,002 ఓట్లతో 36.39శాతం ఓటింగ్‌ను సాధించగా, లోక్‌సభకు వచ్చేసరికి 2,56,187 ఓట్లతో 18.45శాతానికి ఓట్ బ్యాంక్ పడిపోయింది. బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసిన వర్గాల్లో యువత, విద్యార్థులతో పాటు, హిందూత్వ భావజాలం ఉన్నవారు, కుల ప్రాతిపదికన కొందరు ఓటర్లు బీజేపీకి మళ్లడంతో పాటు, బీఆర్ఎస్ తరుపున సాగిన ప్రచారం కూడా ఆకట్టుకోలేకపోవడం, అభ్యర్థుల ప్రాధాన్యం అంతగా కనిపించకపోవడం, పార్టీ శ్రేణులను ఏకతాటిపై నడపడంలో నాయకత్వం పట్టింపులేకుండా వ్యవహరించడం వంటి అంశాలు ఈ ఓట్ బ్యాంక్ తగ్గుదలకు కారణమయ్యాయని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

బీజేపీలో సమన్వయలోపం

ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ రెండో స్థానంలోకి దూసుకువచ్చింది. నల్లగొండ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో 5.08శాతం ఓట్ బ్యాంక్ సాధిస్తే, ఎంపీ ఎన్నికల్లో 17.57శాతం ఓట్లు సాధించింది. బీఆర్ఎస్‌కంటే అరశాతం అధికంగా ఓట్లను రాబట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్లు వచ్చిన నల్లగొండ (7,828), మిర్యాలగూడ (3,024) స్థానాల్లో ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మించి ఓట్లు సాధించింది. నల్లగొండలో 51,451ఓట్లు వస్తే, మిర్యాలగూడలో 36,511ఓట్లు వచ్చాయి. సూర్యాపేటలో మాత్రం అసెంబ్లీ కంటే ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ ఎన్నికల్లో 40,407 ఓట్లు వస్తే, ఎంపీ ఎన్నికల్లో 32,615 ఓట్లే వచ్చాయి. పార్టీకి బలమైన నాయకత్వం, మొదటి నుంచి ఓట్ బ్యాంక్ ఉన్న నియోజకవర్గమైనా, నాయకత్వానికి, అభ్యర్థికి మధ్య ఉన్న గ్యాపే ఓటింగ్ తగ్గుదలకు కారణంగా చెబుతున్నారు. అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో మాత్రం బీజేపీ మూడో స్థానంతోనే సరిపుచ్చుకుంది. ఇక్కడ బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచి 27,781 ఓట్లు సాధిస్తే, బీజేపీకి 21,777 ఓట్లు వచ్చాయి. అభ్యర్థి, పార్టీ క్యాడర్, పాత, కొత్త నేతల మధ్య సమన్వయం కుదిరితే సూర్యాపట జిల్లాలోనూ మరిన్ని ఓట్లు పెరిగేవని, భువనగిరి తరహాలో అన్ని నియోజకవర్గాల్లో ద్వితీయ స్థానంలో ఉండేవాళ్లమని పార్టీ నేతలు చెబుతున్నారు.

రెండు చోట్ల మాత్రమే పెరిగిన కాంగ్రెస్ ఓటింగ్

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చుకుంటే, లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో హుజూర్‌నగర్, సూర్యాపేట మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో 1,16,707 ఓట్లు వస్తే, ఎంపీ ఎన్నికల్లో 1,33,200 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ కంటే 16,493 ఓట్లు అధికంగా వచ్చాయి. అదేవిధంగా సూర్యాపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ద్వితీయ స్థానంతో సరిపుచ్చుకొని 70,537 ఓట్లకు పరిమితమైతే, ఈ ఎన్నికల్లో పార్టీ ఏకతాటిపై నడవడం, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి వర్గవిభేదాలు వీడి పనిచేయడంతో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కంటే ఆధిక్యత సాధించింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల కంటే 32,736 ఓట్లు అదనంగా ఈ నియోజకవర్గంలో సాధించింది.

అధికారపార్టీకి 10చోట్ల తగ్గిన ఓటింగ్

నల్లగొండ లోక్‌సభ పరిధిలో 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత శాసనసభ ఎన్నికల కంటే ఎంపీ ఎన్నికల్లో తక్కువ ఓట్లు వచ్చాయి. మిర్యాలగూడలో 14,972 ఓట్లు కాంగ్రెస్‌కు తగ్గాయి. నాగార్జునసాగర్‌లో 12,739 ఓట్లు, దేవరకొండలో 11,265 ఓట్లు, నల్లగొండలో 2,775 ఓట్లు, కోదాడలో 1,283 ఓట్లు అధికార పార్టీ అభ్యర్థికి తగ్గాయి. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా కనిపించింది. ఆలేరు నియోజకవర్గంలో అసెంబ్లీ కంటే 45,410 ఓట్లు తగ్గాయి. నకిరేకల్ నియోజకవర్గంలో 36,626 ఓట్లు, తుంగతుర్తిలో 26,448 ఓట్లు, భువనగిరిలో 28,423 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి తగ్గాయి. మునుగోడు అసెంబ్లీలోనూ 10,957 ఓట్ల తగ్గుదల కనిపించింది. భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వచ్చే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 38,493 ఓట్లు తగ్గగా, జనగామలోనూ స్వల్పంగా 7,160 ఓట్లు తగ్గాయి. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఊపు ఈ ఎన్నికలకు తగ్గిందని, ఇదే తగ్గుదల కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రతిపక్షాలకు అవకాశమిచ్చినట్లు అవుతుందని, ఈ తగ్గుదలపైనా అధిష్ఠానం సమీక్ష నిర్వహించాలని అధికార పార్టీ నేతల్లో చర్చ సాగుతోంది. అయితే కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లలో బీజేపీ, బీఆర్ఎస్‌కు చీలాయని, కాంగ్రెస్‌కు మంచి మెజార్టీ కనిపించినా, ప్రతిపక్షంగా ఒకే పార్టీకి ఓటర్లు మొగ్గితే మెజార్టీల్లోనూ గణనీయమైన తగ్గుదల కనిపించేదని, ఈ అంశాలను పార్టీ అగ్రనేతలు పరిశీలించాలని క్యాడర్‌లో చర్చ సాగుతోంది. మరి అధిష్ఠానం దీనిపై చర్చించి స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ ఓట్లు చీలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సిందే.

విద్యార్థుల ప్రవేశాల సంఖ్య
పెరిగేలా చర్యలు



అనాజిపురంలో బడిబాటను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈవో నారాయణరెడ్డి

- డీఈవో నారాయణరెడ్డి
- బడిబాట కార్యక్రమం ప్రారంభం

భువనగిరి రూరల్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కే.నారాయణరెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం భువనగిరి మండలం అనాజిపురం గ్రామంలో బడిబాట ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా 6-14 ఏళ్ల పిల్లలు దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలపేతానికి కృషి చేయాలన్నారు. పాఠశాలల్లో ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనాలు, డిజిటలైజేషన్ తరగతుల బోధనపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంపీ నాగవర్ధన్‌రెడ్డి, సీఎంవో పెసర లింగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్‌పర్సన్ రాయపురం ప్రీతి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలి

సీఎస్ శాంతికుమారి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి, పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, తదితరులు

భువనగిరి అర్బన్, జూన్ 6: నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు పోలీసులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటుతోపాటు నిఘా పటిష్ఠం చేయాలని, విత్తన డీలర్ల రిజిస్టర్లను తనిఖీ చేయడంతో పాటు ప్రతి రోజు డీలర్లు రిపోర్టులు పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున జూన్ 11లోగా విద్యార్థులకు అందించే యూనిఫాంలను సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు 78,345 పత్తి విత్తనాల ప్యాకెట్లు విక్రయం జరిగిందని, ఇంకా 66,858 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 14,117 మెట్రిక్ టన్నుల యూరియా, 829 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,160 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 375 మెట్రిక్ టన్నుల పోటాష్, 186 మెట్రిక్ టన్నుల సూపర్‌పాస్ఫేట్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీకి సంబంధించి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సమీక్షలో డీఈవో కే.నారాయణరెడ్డి, వ్యవసాయాధికారి అనురాధ, డీపీవో సునంద, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జూన్ 6: జిల్లాలో ఈ నెల 9న గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. పురుషులు, మహిళలను వేర్వేరుగా తనిఖీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని, కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించవద్దన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ యాక్షన్ ప్లాన్ కార్యాచరణతో పరీక్షా కేంద్రాలను మూడు మార్లు పరిశీలించాలన్నారు. ఐడెంటిఫికేషన్ అధికారులు అభ్యర్థుల ఐడీ కార్డుల తో పాటు హాల్ టికెట్లను పరిశీలించి అనుమతించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఫోన్లను అనుమతించవద్దన్నారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రం అత్యవసర నిమిత్తం మొబైల్ ఫోన్‌కు అనుమతి ఉందన్నారు. జిల్లాలో మొత్తం తొమ్మిది కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందని, మొత్తం 3,349మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. నిమిషం నిబంధన కచ్చితంగా అమలు అవుతుందన్నారు. హాల్ టికెట్ డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఎదురైతే 8331 997006, 8331997037 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. ప్రతీ అభ్యర్థి ఒక గుర్తింపు కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ మాత్రమే తీసుకెళ్లాలన్నారు. హాల్ టికెట్‌పై ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరిగా చేయించాలన్నారు. అభ్యర్థులు షూ, సాక్స్ ధరించకుండా కేవలం చెప్పులు మాత్రమే వాడాలన్నారు. దివ్యాంగులు ముందుగానే సహాయకుడి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటర్ బాటిళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్యాడ్లు, తెల్ల కాగితాలకు సైతం అనుమతిలేదన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథరెడ్డి, డీఈవో కే.నారాయణరెడ్డి, ప్రొఫెసర్ బాలాజీ, ఏడీ నీలిమ, పాల్గొన్నారు.

లక్ష్యం చేరిన ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి అర్బన్, జూన్ 6: జిల్లాలో నిర్దేశించిన ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని చేరుకున్నామని అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 2023-24 యాసంగిలో 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, 3.37లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. గత యాసంగి కంటే నెల రోజుల ముందుగానే కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. అదేవిధంగా బియ్యం సేకరణలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉండేలా కృషి చేయాలని అధికారులు, రైస్ మిల్లర్లను కోరారు. సమావేశంలో పౌరసరఫరాలశాఖ అధికారి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ గోపీకృష్ణ, డీఆర్డీవో ఎంఏ.కృష్ణన్, డీసీవో ప్రవీణ్, డీఏవో అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల కిట్లతో ప్రయోజనాలు



రైతులకు భూసార కిట్లు పంపిణీచేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అనురాధ

సంస్థాన్‌నారాయణపురం, జూన్ 6: అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్ష కిట్లు దోహదపడతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ తెలిపారు. గురువారం మండల పరిధిలోని వాయిలపల్లి క్లస్టర్‌లో రైతులకు సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో భూసార పరీక్ష మినీ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. నేలలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడే మంచి దిగుబడులు వస్తాయన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ వరి పరిశోధనా సంస్థ అభివృద్ధి చేసిన ఈ కిట్‌తో రైతులకు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఏఏటీటీసీ సైంటిస్ట్ అనిల్‌కుమార్, ఏడీఏ ముత్యాల నాగరాజు, ఎంపీటీసీ జంగయ్య, ఏఈవో నవీన్, పరశురాములు, అరుణా, శివ, శశిబిందు, స్వప్నిక, పాల్గొన్నారు.

చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తులు

- శనిజయంతి ప్రత్యేక అమావాస్యతో భారీగా రాక
- కొండపై నిద్రించిన భక్తులు

నార్కట్‌పల్లి, జూన్ 6: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర



చెర్వుగట్టుపై నిద్ర చేసేందుకు వచ్చిన భక్తులు

స్వామి దేవస్థానంలో గురువారం రాత్రి లక్ష పుష్పార్చన ఉత్సవం వైభవంగా జరిగింది. అమావాస్య తిథి అందునా పదేళ్ల తర్వాత వచ్చిన శని జయంతి రోజే వచ్చిన ప్రత్యేక అమావాస్య కావడంతో చెర్వుగట్టు క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత ప్రధానాల యం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివన్నామ స్మరణల మధ్య పల్లకిసేవతో మహా మంటపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పో తులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చక స్వాములు, వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య లక్ష పుష్పార్చన ఉత్సవం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. పుష్పార్చన అనంతరం స్వామివారి చెంత పూజలందుకున్న పుష్పాలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. 40వేల



లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

మంది భక్తులు రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. కాగా ఆలయానికి వచ్చిన భక్తులు కొందరు కొండపై నిద్ర చేయగా మరికొందరు దర్శనం చేసుకుని వెళ్లారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. చెర్వుగట్టు క్షేత్రానికి విచ్చేసిన భక్తులకు ఎల్లారెడ్డిగూడెం ఆర్చి వద్ద ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్టు, వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సత్రం చైర్మన్ రంగా శేఖర్, వైస్ చైర్మన్ మీలా సోమయ్య, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

కారు వెనుక భాగంలో పాము

- భయభ్రాంతులకు గురైన యాత్రికులు

భువనగిరి రూరల్, జూన్ 6: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం అనంతారం గ్రామ శివారులోని స్వర్ణగిరి వేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు వచ్చిన సిద్ధిపేట భక్తులు గంట పాటు భయభ్రాంతులకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. సిద్ధిపేట మండలం సీతారాంపూర్‌కు చెందిన రవి కారులో అతని స్నేహితుడు సిద్దిపేట జిల్లా దుద్దెడకు చెందిన జగదీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం స్వర్ణగిరి దేవాలయ సందర్శనకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కారు ఎక్కుతుండగా, కింద భాగంలో నాగుపాము కనపడటంతో భయభ్రాంతులకు గురయ్యాడు. గమనించిన భక్తులు కారులో దూరిన పామును నెమ్మదిగా బయటకు తీసి అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. ఈ ఘటనతో భక్తులు కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు.



కారులో దూరిన పాము

డివైడర్‌ను ఢీకొట్టి అదుపు తప్పిన కారు

- మరో కారును ఢీకొనడంతో ఇరువురికి గాయాలు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 6: అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు అవతలి వైపు రోడ్డులో వెళ్తున్న కారును ఢీకొట్టటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న పోట్ల రామారావు, తన సోదరుడు ప్రసాద్‌తో కలిసి కారులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురజాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో మిర్యాలగూడ పట్టణంలోని హనుమాపేట ఫ్లైఓవర్ వంతెన వద్దకు చేరుకోగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుగా వస్తున్న వీరి కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందుభాగం పూర్తిదెబ్బతినగా, గురజాలకు వెళ్తున్న ప్రసాద్, రామారావు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును నడుపుతున్న మిర్యాలగూడ మండలం ముల్కలకాల్వకు చెందిన పొదిళ్ల వేణు సైతం స్వల్పంగా గాయపడ్డాడు. రెండు కార్లలో ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగ అరెస్టు

మఠంపల్లి, జూన్ 6: తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను సూర్యాపేట జిల్లా మఠంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదుకు చెందిన వనమాల సైదులు చెడు వ్యసనాలకు అలవాటు పడి భార్య, పిల్లలను వదిలి ఒంటరిగా ఉంటున్నాడు. కొన్ని రోజుల క్రితం మఠంపల్లికి వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. మఠంపల్లి మండలకేంద్రానికి చెందిన వెచ్చ చంద్రశేఖర్ ఏప్రిల్ 28వ తేదీన ఇంటికి, దుకాణానికి తాళాలు వేసి కుటుంబసభ్యులతో కలిసి ఒంగోలుకు వెళ్లాడు. గమనించిన సైదులు మే 1వ తేదీ రాత్రి ఇనుపరాడ్డుతో ఇంటి తాళాలు పగులగొట్టి పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగార ఆభరణాలు, నగదు దొంగిలించి హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులకు రూ. 2లక్షలకు కొంత బంగారాన్ని అమ్మాడు. అందులో రూ.30వేలు జల్సాలకు ఖర్చు చేసుకున్నాడు. మిగిలిఉన్న బంగారు ఆభరణాలను తీసుకెళ్లడానికి మఠంపల్లిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటికి మంగళవారం వచ్చాడు. ఆభరణాలు తీసుకొని బుధవారం హైదరాబాదుకు వెళ్తుండగా మఠంపల్లి ఆటోస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్ప దంగా కన్పించాడు. సైదులును అదుపులోకి తీసుకొని విచారించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అతనిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తమదైన శైలిలో విచారణ నిర్వహించారు. తాను చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి నగదు రూ.లక్షా 70వేలు నగదు, కొన్ని బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గాలి వాన బీభత్సం

● ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల విరిగిన స్తంభాలు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ● చండూరు పట్టణం జలమయం


చండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు


యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

యాదాద్రి, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 46.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదగిరిగుట్టలో 35.5మిల్లీమీటర్లు, వలిగొండలో 27.0 మిల్లీమీటర్లు, నారాయణపూర్‌లో 15.3మిల్లీమీటర్లు, గుండాలలో 1.5 మిల్లీమీటర్లు, మోత్కురులో 0.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాత్రి వేళలో ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

మద్దిరాలలో మండలంలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం

మద్దిరాల: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో గాలి వాన బీభత్సం సృష్టించాయి. పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. జి.కొత్తపల్లిలో రంగారావు ఇంటిపై చెట్టు పడడంతో రేకులు ధ్వంసమయ్యాయి.

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లిలో గురువారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాలల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. చల్లని గాలులతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం సాయంత్రం 20 నిమిషాలపాటు కురిసింది. దీంతో పాదచారులు, వాహనదారులు కొంతవరకు ఇబ్బందులకు గురయ్యారు.

పొంగిన వాగులు

చండూరు రూరల్: వర్షానికి మండలంలోని పడమటితాళ్ల, చామలపల్లి, తాస్కానిగూడెం గ్రామాల్లోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. వర్షాకాలం రాకమునుపే తొలకరి పలకరింపుతోనే మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పడమటితాళ్ల వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం నిండి పొంగి పొర్లుతుండటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

చండూరు: చండూరులో బుధవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి పట్టణం జలమయమైంది. కస్తూర్బాగాంధీ పాఠశాల ఎదుట ఉన్న పట్టణ ప్రధాన రహదారిపై నీరు ఎక్కువ లోతులో నిలిచిపోవడంతో వాహనదారులు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించారు. ఇక్కడ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన డ్రైనేజీ పనులను కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు ప్రధాన రహదారిపైకి రావడంతో వాహనదారులు, దుకాణదారులు, ఇబ్బంది పడ్డారు. రోడ్డు విస్తరణ పనులు పునః ప్రారంభించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని చండూరు మున్సిపాలిటీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న ఆరోపించారు. వర్షాకాలం ఆరంభంలోనే పట్టణమంతా జలదిగ్బంధమైందన్నారు.

వర్షం వస్తే చాలు రోడ్లన్నీ చిత్తడే

మర్రిగూడ: రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు శివన్నగూడెం నుంచి మేటిచందాపురం, ఇందుర్తి, కొట్టాల, నామాపురానికి వెళ్లే రోడ్లు నుంచి వాహనదారులు వెళ్లే పరిస్థితి లేదు. శివన్నగూడెం నుంచి నామాపురం వెళ్లే రోడ్డు వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారింది. ప్రయాణికులు, బాటసారులు, ద్విచక్రవాహనదారులు గుంతలలో పడి ప్రమాదానికి గురవుతున్నారు.


పడమటితాళ్లలోని వాగుపై నిర్మించి చెక్‌డ్యాం నిండి పొర్లుతున్న నీరు

మూడు రోజులుగా నీటిలోనే దేవాలయం


నీటిలో మునిగిన ఆంజనేయస్వామి దేవాలయం

నల్లగొండ రూరల్, జూన్ 6: నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, మసీదు నీటిలో మునిగాయి. ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజులుగా దేవాలయంలోని గర్భగుడిలో సాగానికి పైగానీరు నిండి, దీపారాదన చేయడానికి కూడా వీలులేకుండా పోయింది. దేవాలయానికి వచ్చే భక్తులు నీటిలోనే ప్రదిక్షణలు చేస్తున్నారు. ఈ విషయాన్ని మునిసిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఉదయం మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ హమ్మద్ తదితరులు పంట పొలాలు, వరద నీటిని పరిశీలించారు. వరద ఒక్కసారిగా పొలాలపై ఎందుకు వచ్చిందో కారణాలు అడిగి తెలుసుకున్నారు. మసీదు కింది భాగంలోని కల్వర్టులో రైతులు వేసిన మట్టి తొలగించడంతో వరద నీరు ఒక్కసారిగా సమీపంలోని దేవాలయం మీదుగా రైతుల పంట పొలాల నుంచి స్థానికులు రైతులు పేర్కొంటున్నారు. రైతుల పొలాలతోపాటు, రోడ్డుపై పెద్దఎత్తున నీరు చేరడంతో నల్లగొండ నుంచి పానగల్ మీదుగా నకిరేకల్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహించడంతో రోడ్డు కొట్టుకుపోయింది. ఈ వరద నీటితో రోడ్డు పక్కన ఉన్న ప్లాట్లు, పొలాలు కోతకు గురి కావడంతో తీవ్ర నష్టం కలుగుతుందని స్థానిక రైతులు ఆందోళన వక్తం చేస్తున్నారు. పై నుంచి వరదలు వరద కాల్వల గుండా వెళ్లకుండా కొంతమంది వరద కాల్వలను ఆక్రమించుకోవడంతో వరద నీరు పంట పొలాల మీదుగా పోతోందన్నారు. ఈ సమస్య ఇప్పటి కాదని, ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని స్థానికులు చెప్పారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరద నీరు పొలాలు, ప్లాట్లపై నుంచి నీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


వరద నీరు వచ్చే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వరద నీరు పొలాల నుంచి రాకుండా చర్యలు తీసుకుంటాం

పానగల్ గ్రామ సమీపంలో వరద కాల్వల ద్వారా నీరు వెళ్లకుండా కొంత మంది అడ్డు కట్ట వేస్తాం. అంతేకాకుండా పై భాగం నుంచి వరద నీటు కిందకు రాకుండా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడాం. అదే విధంగా రోడ్డు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపడతాం.

● సయ్యద్ ముసాబ్ హమ్మద్, మునిసిపల్ కమిషనర్

దేవాలయాలు నీటిలో మునిగినా పట్టించుకోవడం లేదు

దేవాలయానికి చుట్టుపక్కన కొందరు వరద నీటి కాల్వలను ఆక్రమించుకోవడంతో ఆ వరద నీరు దేవాలయంలోకి చేరుకుంటుంది. ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజులుగా దేవాలయం నీట మునిగి ఉంది. మునిసిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

● కట్టు వెంకటొరెడ్డి, పానగల్.

పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంకు ఎన్నికల షెడ్యూల్ విడుదల


పోచంపల్లి బ్యాంకు ఎన్నికల వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6: యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన కార్యవర్గం ఎన్నికల నిర్వహణ షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్, డీసీబీ నల్లగొండ కార్యాలయం అధికారి జి శ్రీనివాస్ గురువారం విడుదల చేశారు. పోచంపల్లి బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 14న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పరిశీలన, ఈనెల 15న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, గుర్తులను ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు వెల్లడిస్తామని తెలిపారు. ఈనెల 21న పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. పాలకవర్గం సభ్యులు (డైరెక్టర్) 9 స్థానాలు, అందులో ఎస్సీ/ఎస్టీ 1, మహిళల నుంచి 2, జనరల్ క్యాటగిరి నుంచి ఆరుగురు చొప్పున పోటీ చేయవచ్చని తెలిపారు. బ్యాంకు డైరెక్టర్ ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000, వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు రూ.2,000, ఇరత అభ్యర్థులకు రూ. 4,000 చొప్పున నామినేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఓటు వేయు సభ్యుడు విధిగా తమ గుర్తింపు కార్డును వెంట తీసుకురావలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణాధికారి జి శ్రీనివాస్‌తోపాటు బ్యాంకు సీఈవో సీత శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ రాచకొండ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని 24 గంటలు సేవలందించాల్సిన 10 ఆరోగ్య కేంద్రాలకు సుస్తీ చేసింది. సిబ్బంది, మందులు, మౌలిక వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరితోనే సేవలు కొనసాగిస్తున్నారు. దీంతో ఉదయం 9 గంటలకు వస్తున్న వైద్యులు సాయంత్రం నాలుగు గంటల వరకు ఉండి వెళ్లిపోతున్నారు. దీంతో సేవలు 7 గంటలే అన్నట్లుగా పరిమితం అవుతున్నాయి. కొన్నిచోట్ల నర్సులు, ఏఎన్ఎంలే సేవలు అందిస్తు న్నారు. రాత్రి వేళ ప్రజలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా జిల్లా కేంద్రానికో, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వ వైద్యసేవల కోసం వేచిచూసే పేదలకు వైద్యసేవలు ఆర్థికభారమవు తున్నాయి. కొన్నిచోట్ల అరకొర మందులతో నెట్టుకొస్తున్నారు. వెరసి ఆసుపత్రుల తీరు పేరుగొప్ప ఊరు దిబ్బలా మారింది.





రాజాపేట : జిల్లాకు సరిహద్దులో ఉండే రాజాపేటలో 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. అయితే ఈ కేంద్రంలో ఇద్దరు వైద్యులకు ఒక్కరితోనే అరకొర సేవలు అందుతున్నాయి. ఆరు మొదటి ఏఎన్ఎం పోస్టులు, రెండు హెల్త్‌అసిస్టెంట్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడేళ్లుగా పోస్టుల భర్తీ జరగలేదు. మేల్ సూపర్‌వైజర్ పోస్టు రెండేళ్లుగా, ఎన్‌హెచ్ స్టాఫ్‌నర్స్ ఒక ఖాళీగా ఉంది. ఉదయం 9 , 10 గంటలకు వచ్చిన వైద్యుడు సాయంత్ర 4, 5 గంటల వరకు సేవలు అందిస్తుం టారు. ఆ తర్వాత ప్రజలుకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఏఎన్ఎం, నర్సులు దిక్కు. ప్రతి రోజూ 140 మంది వరకు రోగులు వస్తుండగా సిబ్బంది కొరతతో ప్రజలు ఇబ్బందులు పడటమే కాక ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. 108 వాహనం మరమ్మతులకు గురికావడంతో పంపించారు. రెండేళ్లుగా అందుబాటులో లేదు. అత్యవసరమైతే 25 కిలోమీటర్ల దూరంలోని యాదగిరిగుట్ట, ఆలేరు పట్టణాల నుంచి రావాల్సి వస్తోంది. దీంతో పాము, తేలుకాటుకు గురైన వారికి సకాలంలో వైద్యం అందడం లేదు. అదే సమయంలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఆసుపత్రిలో జనరేటర్ మరమ్మతుకు గురికావడంతో కొన్నినెలలు సేవలు అందడంలేదు.

పేరుకే 24 గంటల ఆసుపత్రులు

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని 20 ఏళ్ల కిందటే 24 గంటల ఆసుపత్రికి ఏర్పాటుచేశారు. ఇద్దరు డాక్టర్లకు ఒక్కరే ఉన్నారు. ఈ ఆసుపత్రి పరిధిలో ఆత్మకూరు, కొరటికల్, పల్లెపహాడ్, పల్లెర్ల, కూరెళ్ల, ఖప్రాయిపెల్లి, సింగారం సబ్‌సెంటర్లు ఉన్నాయి. అయినప్పటికీ మొదటి ఏఎన్ఎం లేదు. రెండో ఏఎన్ఎంలతో సెంటర్లను నిర్వహిస్తున్నారు. అన్నిరకాల మందులు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతి రోజూ 70 మందికి అవుట్‌పేషంట్లు వస్తుంటారు. ఈ కేంద్రానికి 108 వాహనం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సంస్థాన్‌నారాయణపురం: మండలకేంద్రంలో 24 గంటలు సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఒకరు కంటి వెలుగు కార్యక్రమానికి డిప్యూటేషన్‌పై వెళ్లగా మిగిలిన ఒక్క డాక్టరే విధులను నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్‌పై పీహెచ్ఎన్ వెళ్లడంతో పాటు ఆయాల కొరత ఉంది. దీంతో సేవలు అందడం లేదు. ఒక్క ఉన్న డాక్టర్‌తో 4 గంటల వరకు సేవలు అందిస్తున్నా ఆ తర్వాత రోగులకు అత్యవసరమైతే ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ప్రధానంగా గిరిజనతండాలు ఎక్కువగా ఉన్న ఈ మండలంలో రాత్రి వేళ కాన్పు కోసం వచ్చే గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఆసుపత్రిలో మంచినీటి సమస్య నెలకొంది.

బీబీనగర్ : మండల కేంద్రంలోని 24 గంటల పీహెచ్‌సీని సమస్యలు వేధిస్తున్నాయి. సరైన వసతి సౌకర్యం లేని ఇరుకుభవనంలో కొనసాగిస్తున్నారు. దీంతో వైద్య సేవల పరంగా సిబ్బంది, అదేవిధంగా రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యులు, సిబ్బంది ఉన్నా అనువైన భవన సౌకర్యం లేక రోగులకు ఆశించిన సేవలు అందడం లేదు. ప్రధానంగా ప్రసవాలు చేయడానికి సౌకర్యాలు లేవు. దీంతో ఇక్కడికి వచ్చిన వారిని భువనగిరి ఏరియాఆసుపత్రికి పంపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ద్వారా కొత్త భవనానికి రూ. 50లక్షల నిధులు మంజూరు చేయించారు. దాంతో పనులు కూడా మొదలయ్యాయి. ప్రస్తుతం ఆసుపత్రి భవనం నిర్మాణ దశలో ఉంది. త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ఆరోగ్య కేంద్రాన్ని కొత్త భవనంలోకి మార్చి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారి ఒక్కరే ఉండటంతో అత్యవసర సేవలు అందడం లేదు. కనీసం 108 వాహన సౌకర్యం లేదు. అవసరమైన సమయాల్లో బీబీనగర్, చౌటుప్పల్ నుంచి రప్పించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇద్దరు వైద్యులు ఉండాల్సిన చోట ఒక్కరితోనే దశాబ్దకాలంగా అరకొర సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా మేల్, ఫిమేల్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో లేవు. రోగులు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

కోడ్‌తో నిలిచిన ప్రారంభం

వలిగొండ: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 300 మంది వైద్య సేవల కోసం వస్తుంటారు. ప్రస్తుతం 25 ఏళ్ల కిందట నిర్మించిన భవనంలో సేవలు అందిస్తున్నారు. కొత్త భవనం నిర్మించినప్పటికీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభానికి నోచుకోలేదు.

మూడు ఏఎన్ఎం, కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది కొరత ఉంది. రాత్రి వేళల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారు.

రూ.1.5 కోట్లతో నిర్మించినా...

మోటకొండూర్ : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో యునైటెడ్ వే హైదరాబాద్ వర్చూసా ఐటీ కంపెనీ సహకారంతో రూ.1.50 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి ప్రారంభించి ఏడాది గడుస్తున్నా నేటికి అందుబాటులోకి రాక నిరుపయోగంగా ఉంది. దీనికితోడు జీటీవీ దాతలు సమకూర్చిన 108 అంబులెన్స్‌కు డ్రైవర్ లేకపోవడంతో వాహనాన్ని ఉపయోగించడంలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మోటకొండూరు పీహెచ్‌సీలో వైద్యాధికారులు సమయపాలన పాటించడంలేదు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాల్సి ఉండగా, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఉందని రోగులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలు దాటితే స్టాఫ్ నర్సు, అటెండర్ మినహా ఎవరూ అందుబాటులో ఉండరన్న విమర్శలు ఉన్నాయి. సాయంత్రం అత్యవసర సేవలు అందడం లేదు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. నైట్ వాచ్‌మెన్, కాంటిజెంట్ వర్కర్, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్నిరకాల మందులు అందుబాటులో లేక రోగులు ప్రైవేట్ దుకాణల్లో కొనుగోలు చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న 30 పడకల ఆసుపత్రి

రెండు నెలలుగా కు.ని. ఆపరేషన్లు బంద్

యాదగిరిగుట్ట రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట పట్టణంలో 24 గంటల వైద్యసేవలు నామమాత్రంగానే అందుతున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు ప్రతి నిత్యం రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో కనీస వైద్యసేవలు అందుబాటులో లేవు. ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, పారిశుధ్య సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యులు కేవలం ఏడు గంటలు మాత్రమే అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం మెడికల్ ఆఫీసర్ ఒక్కరే ఉన్నారు. మరొకరు జిల్లా కేంద్రానికి ప్రమోషన్‌పై వెళ్లారు. వారంలో రెండురోజులు వచ్చి వెళ్తుంటారు. ఆసుపత్రిలో కేవలం ఆరు పడకలే ఉన్నాయి. రెండు నెలల నుంచి కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తిగా నిలిపివేసి ప్రసవం కోసం వచ్చిన మహిళలను జిల్లా కేంద్రం ఆసుపత్రికి పంపిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంలతో సేవలు అందిస్తారు. అత్యవసర సేవలు లేకపోవడం, బీపీ, షుగర్ మందులు లేక తాగు నీరు సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని 24 గంటల ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ సేవలు కరువయ్యాయి. ప్రభుత్వం సాధారణ కాన్పులను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఎయిమ్స్ దత్తత తీసుకున్న ఈ ఆసుపత్రికి ప్రత్యేకంగా గైనకాలజిస్ట్ నియమించాలని ప్రజలు కోరుతున్నారు. అన్నిరకాల మందులతో పాటు పూర్తి స్థాయి సిబ్బంది నియమించాల్సి ఉంది.

వంతుల వారీగా వైద్యసేవలు

మోత్కూరు : మోత్కూరు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఈ కేంద్రానికి నిత్యం 80 నుంచి 100 మంది అవుట్‌పేషంట్లు వస్తారు. ఆస్పత్రిలో ముగ్గురు డాక్టర్లు ఉన్నా వారు రోజుకు ఒకరు చొప్పున వంతుల వారీగా ఆస్పత్రికి వచ్చి విధులు నిర్వహిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. మోత్కూరు పీహెచ్‌సీ పరిధిలోనే ఆయుర్వేద ఆస్పత్రి ఉంది. అందులో పని చేసే డాక్టర్ డిప్యూటేషన్‌పై వెళ్లి ఏడాదికి పైగా అవుతోంది. అటెండర్, ఫార్మాసిస్ట్ ఉన్నా తోచినప్పుడు వచ్చిపోతుంటారు. డాక్టర్ లేరని ఆస్పత్రికి మందులు ఇవ్వడం లేదు. దీంతో ఆయుర్వేద ఆసుపత్రి ఉన్నా నిరుపయోగంగా మారింది. అదేవిధంగా అన్నిరకాల మందులు అందుబాటులో ఉండటం లేదు. సబ్‌సెంటర్ల పరిస్థితి దారుణంగా ఉంది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంకా రెండు నెలల వేతనాలు రావాల్సి ఉంది.

24 గంటల ఆస్పత్రే అయినా రాత్రి డాక్టర్ ఉండరు

పేరుకే ఇది 24 గంటల ఆస్పత్రి. సాయంత్రం ఐదు గంటల తర్వాత నుంచి మరునాటి ఉదయం 10 గంటల వరకు డాక్టర్లు ఎవరూ అందుబాటులో ఉండరు. రాత్రి వేళ స్టాఫ్ నర్స్, అటెండర్ ఉంటారు. ఎవరైనా రోగులు వస్తే వైద్యుడిని ఫోన్‌లో సంప్రదించి చికిత్స చేస్తారు. లేదంటే ఇక్కడ కాదు భువనగిరి వెళ్లమని పంపిస్తారు. ఆస్పత్రిలో నీటి సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది. వాష్‌రూంల్లో నీటి సౌకర్యం లేదు. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన మీటింగ్ హాల్ అసంపూర్తిగా ఉంది.


మోత్కూరు పీహెచ్‌సీలో ఓ గది కిటికీ వేలాడ దీసిన ఆయుర్వేద ఆస్పత్రి బోర్డు

నొప్పులకు రాసుకునే ఆయిట్‌మెంట్ కూడా లేదంట



నడుం నొప్పి, మోకాళ్ల నొప్పులతో వస్తే నొప్పులకు రాసుకునే ఆయిట్‌మెంట్ కూడా లేదంటున్నారు. పాన్‌టాప్ లాంటి టాబ్లెట్లు కూడా లేవు.

పి.యాదయ్య, అవుట్‌పేషంట్, కొండగడప

ఆస్పత్రిలో సిబ్బంది కొరత లేదు

ఆరోగ్యకేంద్రంలో సిబ్బందితో పాటు మందుల కొరత లేదు. మీటింగ్‌లు తప్పితే ముగ్గురు డాక్టర్లం ఆస్పత్రికి వస్తాం. ఆస్పత్రి అభివృద్ధి నిధుల గురించి డీఎంఅండ్‌హెచ్‌వోను అడగాలి. రెండు వాష్ రూంలు ఉండగా ఒక దానికి నీటి సౌకర్యం ఉంది. మరో దానికి లేదు.

● హేమంత్‌కుమార్, వైద్యాధికారి, మోత్కూరు

తొమ్మిది వైద్యుల పోస్టులు ఖాళీ

ఆలేరు రూరల్: ఆలేరులోని 30పడకల ఆసుపత్రికి నిత్యం 200మందికి పైగా వైద్యంకోసం వస్తుంటారు. మండలంలోని హైదరాబాద్-భూపాలపల్లి జాతీయ రహదారి (163)పై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. క్షతగాత్రులకు ఈ ఆసుపత్రిలోనే ప్రాథమిక చికిత్స అందించాల్సి ఉంటుంది. 30పడకల సామర్థ్యం ఉన్న ఇందులో 15 పడకల స్థాయి సేవలు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ డిప్యూటీ సివిల్‌సర్జన్‌లు నలుగురు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరే ఉన్నారు. సివిల్ అసిస్టెంట్‌సర్జన్‌లు 11మందికి కేవలం ఐదుగురే ఉన్నారు. మిడ్‌వైఫ్స్, రేడియోగ్రాఫర్, ల్యాబ్ టెక్నీషియన్, బ్యాక్ రూం అసిస్టెంట్, అటెండర్లు, ఎంఎన్‌వో, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వైద్యసేవలు అందడం లేదు. తొమ్మిది మంది వైద్యులు లేని కారణంగా ఉన్న కొద్దిమందితోనే సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రాన్ని 100పడకల ఆసుపత్రిగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



100 పడకల ఆసుపత్రిగా మార్చాలి



సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలి. పూర్తి స్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించి వైద్యసేవలు అందించాలి. జాతీయ రహదారి పక్కన ఉన్నందున ప్రమాదాలు జరిగిన వారికి సకాలంలో వైద్యసేవలు అందిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చు. ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించాలి.

● జూలుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి, ఆలేరు.

నిరంతరం ప్రజా సేవకుడిగా పనిచేస్తా

● పుట్టినరోజు వేడుకలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 6: నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి శ్రేయస్సుకోసం పనిచేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. అయిలయ్య పుట్టినరోజు వేడుకల్లో భాగంగా గురువారం యాదగిరిగుట్టలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు కేక్‌కట్ చేయించారు. నోట్ పుస్తకాలను అందజేశారు. గాయకుడు నర్సింహారెడ్డి ఆలపించిన పాటలతో ఎమ్మెల్యేలు చిందులు వేసి సంతోషాన్ని చాటుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణ నుంచి కొండపైకి ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రచార రథంపై ఎంపీ ఎమ్మెల్యేలు చేరుకున్నారు. సుమారు రెండు వందల మంది వేద పండితులకు విప్ బీర్ల నిత్యావసర సరుకులను అందజేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీ, ఎమ్మెల్యేలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన ఇష్టదైవమైన వీరభద్ర స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు జనగాం ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడెం సంజీవరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మవెంకటస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ఆరపుసార యాదగిరిగౌడ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు బీర్ల శంకర్, ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజ్‌గౌడ్, నమిలె మహేందర్‌రెడ్డి, గుట్ట మున్సిపల్ కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, గౌళికార్ అరుణారాజేష్, బిట్లు సరోజ హరీష్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, శివరాత్రి దానయ్య పాల్గొన్నారు.


ర్యాలీలో ప్రజలకు అభివాదం ప్రభుత్వ విప్ అయిలయ్య, ఎంపీ, ఎమ్మెల్యేలు

మోటకొండూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి టపాసులు కాల్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్ల శంకర్, మాజీ జడ్పీ ఫ్లోర్‌లీడర్ కొంతం మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల్ద రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా జాయింట్ సెక్రెటరీ భాస్కరుని రఘునాథ రాజు, భూమండ్ల శ్రీనివాస్, తండ పాండురంగయ్య పాల్గొన్నారు.


ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు (ఎం): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, జడ్పీటీసీ కే.నరేందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వై.లక్ష్మారెడ్డి, నాయకులు జె.నగేష్, జె.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండాల: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి, మాజీ ఎంపీపీలు కృష్ణారెడ్డి, హరితాదేవి పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని రాజాపేట, చల్లూరు, రఘునాథపురం, బొందుగుల తదితర గ్రామాలల్లో కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

'ఫిర్యాదు చేయడానికి వెళ్లితే ఎస్ఐ కొట్టారు'

మోత్కూరు, జూన్ 6: భూవివాదంపై ఫిర్యాదు చేయడానికి వెళితే మోత్కూరు ఎస్ఐ తమను కొట్టారని దత్తప్పగూడెంకు చెందిన రైతులు ఆరోపించారు. దత్తప్పగూడెంకు చెందిన సోదరులు ఎలుగు సతీష్, ఎలుగు మచ్చగిరికి తమ పొలాల పక్కన భూమి ఉన్న వల్లపు నర్సయ్య, వల్లపు మల్లయ్యతో మూడు రోజులుగా భూమి తగాదా జరుగుతోంది. ఈ క్రమంలో ఎస్ఐ తమపై చేయి చేసుకున్నారని సతీష్, మచ్చగిరి ఆరోపించారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తాను వారిపై చేయిచేసుకోలేదన్నారు.

బెదిరింపు కేసులో పాత నిందితుల అరెస్ట్

భువనగిరి టౌన్, జూన్ 6: దాడి కేసులో ఫిర్యాదు చేసిన బాధితుడిని బెదిరించి అక్రమ వసూళ్లకు ప్రయత్నించిన ముగ్గురు పాత నేరస్తులను భువనగిరి పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఇన్స్‌పెక్టర్ కె సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... భువనగిరిలోని జిల్లా ఆసుపత్రి సమీపంలోని ఓ డయాగ్నోస్టిక్ ల్యాబ్ నిర్వాహకుడిపై 11 మార్చి 2024న భువనగిరికి చెందిన అంబులెన్స్ డ్రైవర్స్ అయిన సోదరులు ఎండి ఖాజా, ఎండి గఫూర్, మరో ల్యాబ్ నిర్వాహకుడైన ఎండి హరున్ కత్తితో దాడి చేశారు. ఈ మేరకు అప్పట్లోనే బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చి జైలుకు తరలించారు. అయితే ఇటీవలే ఆ ముగ్గురు బెయిలుపై విడుదలపై తిరిగి ఈ నెల 5వ తేదీన అదే ల్యాబ్ నిర్వాహకుడి వద్దకు వెళ్లి 'నీవిచ్చిన ఫిర్యాదుతో మేము జైలు పాలయ్యాము, ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాము. పనులు పోయాయి.' అని పేర్కొంటూ డబ్బులు ఇవ్వాలని అలాగే కేసును ఉపసంహరించుకోవాలని బెదిరించారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ కె.సురేష్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ నాగరాజు తెలిపారు. బెదిరింపులకు పాల్పడుతూ అక్రమ వసూళ్లు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని డీసీపీ ఎం రాజేష్ చంద్ర హెచ్చరించారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

చౌటుప్పల్ టౌన్, జూన్ 6: చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల కమ్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులలో అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సరోజనమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో సంస్కృతం, తెలుగు, ఆంగ్లం, ఫిజికల్ సైన్స్ , కళాశాల స్థాయిలో గణితం, వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రం, రసాయన శాస్త్రం బోధించేందుకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పాఠశాల కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

అడ్డగూడూరు, జూన్ 6: మండలంలోని కంచనపల్లి గ్రామంలో కుటుంబ కలహాల కారణంతో ఓ మహిళ గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ. డి.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... కంచనపల్లి గ్రామానికి చెందిన చేడే నరేష్ భార్య చేడే పూజిత (27) దంపతులు గురువారం ఉదయం గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పూజిత ఉరివేసుకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. నాగరాజు తెలిపారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 6: గ్రామీణ నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామానికి చెందిన చెక్క లింగస్వామికి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య సహాయంగా సీఎం కార్యాలయం నుండి మంజూరైన రూ. 2లక్షల 30వేల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి క్యాంపు ఆఫీస్‌లో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గునిగంటి రమేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, సర్పంచు బొడిగె శంకరయ్యగౌడ్, జింక జంగయ్య పాల్గొన్నారు.


ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

రూ.1.22లక్షల విలువైన విత్తనాలు సీజ్

రామన్నపేట, జూన్ 6: మండలంలోని రామన్నపేట, కక్కిరేణి, ఎన్నారం గ్రామాల్లోని పలు ఎరువులు దుకాణాలను గురువారం భువనగిరి ఏడీఏ బీ.దేవ్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన యూరియాతోపాటు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. లేబుల్ సరిగ్గా లేని రూ.1,22,000 విలువగల విత్తనాలు సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్ డీలర్ల వద్ద కూడా యూరియా రైతులకు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రైవేట్ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పద్మజా, సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు/ గుండాల: యాదగిరిగుట్ట ఏడీఏ పద్మావతి, తుర్కపల్లి, బొమ్మలరామారం ఏవోలు దుర్గేశ్వరి, పద్మ, పోలీసు అధికారులతో కలిసి గురువారం మోత్కూరులోని శ్రీరామలింగేశ్వర, మన గ్రోమోర్, శ్రీరామ విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. గుండాల మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్స్ దుకాణంలో జిల్లా స్క్వాడ్ బృందం సభ్యులు పరిశీలించారు.

బెల్టుషాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు

చౌటుప్పల్ రూరల్, జూన్ 6: చౌటుప్పల్, నారాయణపురంలో మండలలో బెల్టుషాపులు నిర్వహించిన, నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ షాపులు వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరిడెంట్ ఎస్ సైదులు, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ఏసీపీ కార్యాలయంలో ఎక్సైజ్, స్థానిక సివిల్ సీఐలు, ఎస్ఐలు, వైన్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కను నాటుతున్న జడ్జి మహంతివైష్ణవి

చౌటుప్పల్ టౌన్, జూన్ 6: పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహంతి వైష్ణవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం స్థానిక కోర్టు ఆవరణలో జడ్జి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు తాడూరి పరమేష్, పి.జైపాల్ రెడ్డి, ఎ.శ్రీనివాస్, బాల్యం వెంకటా చలపతి, బడుగు శ్రీకాంత్, ఎండి.ఖయ్యూమ్ పాషా, శ్రీశైలం, రాఘవేంద్ర, కోర్టు సూపరిండెంట్ నరేష్ పాల్గొన్నారు.

● పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ విదిగా మొక్కలు నాటాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. స్థానిక మిషన్ భగీరథ పైలాన్ పార్క్‌లో చైర్మన్ రాజు గురువారం మొక్కలను నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ కోస పార్క్‌లోని సందర్శకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు కామిశెట్టి శైలజా, ఎండి. బాబాషరీఫ్, కె. లింగస్వామి, బొడిగే బాలకృష్ణ లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోత్కూరు : బడి ఈడు పిల్లలను, ఇతర విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మోత్కూరు హైస్కూల్ హెచ్ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు, దత్తప్పగూడెం హెచ్ఎం బత్తిని రామకృష్ణ కోరారు. మోత్కూరు, పాలడుగు, దత్తప్పగూడెం పాఠశాలల్లో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు.

గుండాల: మండలంలోని పెద్దపడిశాల ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయులు మారయ్య, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు.అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రణమల్ల శ్రీమతమ్మ, ఉపాధ్యాయులు పారిజాత, దుర్గాభవాని, క్రాంతి, రాములు, జంపాల రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

మోత్కూరు : సమగ్రశిక్షా ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించాలని మెస్సేంజర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఆత్మకూరు(ఎం): మండలంలోని సింగారం, మూటకొండూరు మండలం చాడ గ్రామాల మధ్య నెలకొన్న చేపల పంచాయతీ గురువారం పరిష్కారం అయ్యింది. ఎస్ఐ నాగరాజు ముందుగా ఇరుగ్రామాల వారితో మాట్లాగ సింగారం గ్రామాభివృద్ధికి రూ.1.50లక్షలు ఇవ్వడానికి చాడ మత్స్యకారులు ఒప్పుకోవడంతో సమస్య సద్దుమణిగింది.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు టిప్పర్లను బీఆర్ఎస్ పార్టీ యువకులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులూ లేకుండా ఇసుకను తరలించడం ఏమిటని యువకులు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వచ్చి ఇసుకను ప్రభుత్వ పనులకు ఉపయోగిస్తున్నారని, అడ్డుకోవడం సరికాదని టిప్పర్లను పంపించేశారు.

వలిగొండ: మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేసవికాల శిక్షణ తరగతుల్లోని క్రీడాకారులకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బొడిగె మధు గురువారం పండ్లు, గుడ్లు, అరటిపండ్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, బిక్షపతి, శ్రీకాంత్, వెంకటేశం పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: కొలతల సాకుతో ఉపాధి కూలీల శ్రమను దోచుకుంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూకుట్ల చొక్కా కుమారి అన్నారు. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఉపాధి కూలీలలో సమావేశం నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు సవాళ్లు అనే అంశంపై ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు.

భువనగిరి అర్బన్ : భువనగిరి పట్టణంలోకి వెళ్లే సర్వీసు రోడ్డును మూసివేసి గుడికి తరలివస్తున్న భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్న ఆలయ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హనుమంతు కే. జెండగేకు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు.

చౌటుప్పల్ టౌన్ : పేద వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరిలో గురువారం చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ని కలిసి సన్మానించారు. నాయకులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, బండమీది మల్లేశం, ఎండి. బాబాషరీఫ్, కొయ్యడ సైదులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: అయ్యప్ప స్వాములకు కేరళలోని ట్రావెన్కోర్ దేవస్థానం వద్ద ఇబ్బందుల దృష్ట్యా తెలంగాణ అధికార యంత్రాంగాన్ని శబరిమలలో ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలంగాణ ఐక్య వేదిక నాయకులు నాయిని బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వడాయిగూడెం వైఎస్ఎన్ఎస్ వాసవి నిత్యాన్నదాన సత్రం సురేంద్రపురిలో తెలంగాణ అయ్యప్ప ఐక్య వేదిక ముఖ్య గురుస్వాముల సమావేశం నిర్వహించారు.

భువనగిరి రూరల్: జడ్పీ సర్వసభ్య సమావేశం ఈనెల 11న ఉదయం 10.30 గంటలకు కార్యాలయ సమావేశపు హాల్లో నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎన్.శోభారాణి గురువారం జారీ చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అభివృద్ధి పనుల పురోగతి గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు సంబంధించి పూర్తి నివేదికలతో అధికారులు హాజరు కావాలన్నారు.